క్లుప్తంగా

అప్పన్న ఆలయంలో వడాయిత్తీ సంప్రోక్షణం



అప్పన్నకు తిరువీధి నిర్వహిస్తున్న వైదికులు

సింహాచలం: మిథున సంక్రమణాన్ని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వడాయిత్తీ సంప్రోక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సంప్రోక్షణం చేశారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలకు స్నపన తిరుమంజనం అనంతరం శీతలోపచారాలు జరిపారు. సాయంత్రం మాడ వీధుల్లో ఉత్సవమూర్తులకు తిరువీధిని వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని తరించారు.

పార్కుల అభివృద్ధికి కృషి



పార్కు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వసంత శంకర్రావు

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డులో పార్కులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని కార్పొరేటర్ శానాపతి వసంత శంకర్రావు అన్నారు. చినముషిడివాడ సమీపంలోని పీఎఫ్ కాలనీలో నేతాజీ పార్కు అభివృద్ధి పనులను ఆమె ఆదివారం పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.40 లక్షల జీవీఎంసీ నిధులతో ఈ పార్కును అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక నాయకుడు శానాపతి శంకర్రావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నేడు పుస్తకావిష్కరణ

సబ్బవరం: సబ్బవరంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి కార్యాలయంలో 'జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని, పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు హాజరుకావాల్సిందిగా కోరారు.

135 మందికి కంటి వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

అగనంపూడి: అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 85 వార్డు ఫార్మాసిటీ కాలనీ లేమర్తి జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, కర్రి దోశేంద్రరావు ప్రారంభించారు. శిబిరంలో 135 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. 42 మందిని శస్త్ర చికిత్స కోసం శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకటరావు, వైస్ చైర్మన్ ఎస్.అర్జున, ట్రస్ట్ సభ్యులు సింగపల్లి రామారావు, లెక్కల సత్యనారాయణ, వార్డు కార్యదర్శి విందుల రాజు, మాజీ సర్పంచ్ చిమిటి అర్జున, దొక్క రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



కోరాడలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రతినిధులు

పెదగంట్యాడ: శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని పత్రీజీ పిరమిడ్ స్పిర్చ్యువల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రేవతీదేవి, బీజేపీ ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి కట్టా పద్మ అన్నారు. అహింసా పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకుడు మీసాల శివ గణేశ్వరరావు ఆధ్వర్యంలో జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని పల్లి వీధి, కోరాడలో ఆదివారం శాకాహార సద్భావన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శాకాహారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. శాకాహారంతో జీర్ణక్రియ సక్రమంగా కొనసాగుతుందని తెలిపారు. సాత్వికాహారం సర్వత్రా ఆరోగ్యానికి మంచిదన్నారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొంగు లక్ష్మి, సుబ్బలక్ష్మి, శారదమ్మ, అప్పారావు, బాలాజీ, మూర్తి, అప్పలరాజు, రమణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ఆదాయం హారీ..

ఏ ప్రభుత్వ శాఖలో అయినా **ఉన్నతాధికారులు చెప్పినట్లు** సిబ్బంది నడుచుకోవాలి. వారి **అనుమతి లేనిదే ఎలాంటి** నిర్ణయం తీసుకోరు. జీవీఎంసీ **జోన్–8 టౌన్** ప్లానింగ్ విభాగంలో సీన్ **రివర్స్. ఇక్కడి** ఉన్నతాధికారులంతా ఓ సచి**వాలయ** కార్యదర్శికి దాసోహమయ్యా**రు.** నిబంధనలు పాటించినా.. **లేకు**న్నా.. అతడు తెచ్చిన ఫైళ్లను ఆమోదించాల్సిందే..! ఒకవేళ అనుమతులు లేకపోయినా **ఉన్న**తాధికారులు గానీ, ఇతర స**చివా**లయాల కార్యదర్శులు గానీ **అటు** వెళ్లేందుకు వీల్లేకుండా అంతా **అతడే** 'సర్దుబాటు' చేసేస్తాడు.



వేపగుంటలోని జోన్–8 జీవీఎంసీ కార్యాలయం

- సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి గుప్పిట్లో జోన్–8 టౌన్ ప్లానింగ్!
- నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇప్పిస్తున్న వైనం
- టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు సైతం అతడికి దాసోహం
- వేపగుంట నుంచి పెందుర్తి వరకు ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు



చినముషిడివాడ పాతూరు సమీపంలో టౌన్‌ప్లానింగ్ కార్యదర్శి కనుసన్నల్లో రోడ్డుపై నిర్మిస్తున్న భవనం

పెందుర్తి: జీవీఎంసీ జోన్–8 టౌన్‌ప్లానింగ్ విభాగం నుంచి ఏ అనుమతి కావాలన్నా అతడు 'శ్రీ'కారం చుట్టాల్సిందే. ఉన్నతాధికారుల కంటే ముందు ఫైల్ అతనికి ఇవ్వాల్సిందే. ఇలా మొత్తానికి జీవీఎంసీ ఆదాయాన్ని 'హారీ'మనిపిస్తున్నాడు. జోన్ పరిధిలో మరీ ముఖ్యంగా నాయుడుతోట, కృష్ణరాయపురం, సుజాతనగర్, పాపయ్యరాజుపాలెం, చినముషిడివాడ, పెందుర్తి ప్రాంతంలో ఇటు వాణిజ్య భవనాలు, అటు అపార్ట్‌మెంట్‌లు, గృహ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుతం ఆయా నిర్మాణాల ద్వారా జీవీఎంసీకి గణనీయమైన ఆదాయం రావాల్సి ఉంటుంది. కానీ ఈ సచివాలయ కార్యదర్శి చేతుల్లో టౌన్‌ప్లానింగ్‌ను పెట్టేసి ఉన్నతాధికారులు చోద్యం చూడడంతో జీవీఎంసీ ఆదాయానికి భారీ గండి పడుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఆ ఒక్కడి చేతిలో..

ఇదేక్రమంలో ముఖ్యంగా చినముషిడివాడ ప్రాంతానికి చెందిన ఓ సచివాలయ టౌన్‌ప్లానింగ్ కార్యదర్శి ఏకంగా వేపగుంటలోని జోనల్ కార్యాలయంలో తిష్ట వేశాడు. తాను పనిచేస్తున్న సచివాలయం పరిధిని పూర్తిగా గాలికి వదిలేశాడు. జోన్–8లో జరుగుతున్న అనేక అక్రమ నిర్మాణాలకు అడ్డగోలు అనుమతులు ఇప్పించే పనిలో నిమగ్నమయ్యాడు. మరోవైపు కూటమి పెద్దల ఒత్తిడో, మరే కారణాలో తెలియదు గానీ టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు సైతం ఆ విభాగాన్ని పూర్తిగా అతడి చేతుల్లో పెట్టేశారు. కేవలం అతడు తెచ్చిన ఫైళ్లపై సంతకాలు పెట్టి, అనుమతులు ఇవ్వడానికి మాత్రమే వారు పరిమితమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జోరుగా అక్రమ నిర్మాణాలు

జోన్–8 టౌన్ ప్లానింగ్ అధికారులు పూర్తిగా బాధ్యతలు విస్మరించడంతో సుజాతనగర్, పెందుర్తి, చినముషిడివాడ, పురుషోత్తపురం, పాపయ్యరాజుపాలెం ప్రాంతాల్లో అనుమతి లేని నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. చినముషిడివాడ పాతూరు ప్రధాన రోడ్డు స్థలాన్ని ఆక్రమించి వాణిజ్య సముదాయం నిర్మిస్తున్నా స్థానిక ప్లానింగ్ విభాగం కార్యదర్శి పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అతడే ఆ నిర్మాణానికి కర్త, కర్మగా వ్యవహరిస్తున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా స్పందించి జోన్–8 పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిద్రమత్తులో టౌన్ ప్లానింగ్

కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలో జోన్–8 పరిధిలో టౌన్‌ప్లానింగ్ అనుమతి లేని నిర్మాణాల సంఖ్య భారీగా పెరిగింది. కూటమి ముఖ్యనేతలతో పాటు టీడీపీ, జనసేన నాయకులు అధికారులపై ఒత్తిడి తేవడంతో టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు పూర్తిగా నిద్రావస్థలోకి వెళ్లిపోయారు. ఇదే అదనుగా కూటమి నాయకుల పంచన చేరిన కొందరు సచివాలయాల ప్లానింగ్ కార్యదర్శులు.. అక్రమాలకు అన్నివిధాలా అండగా నిలుస్తున్నారు. స్థానికంగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నా అధికారుల దృష్టికి వెళ్లకుండా 'మామూళ్ల'గా మిన్నకుండిపోతున్నారు.

అనుమతుల్లేకుంటే చర్యలు తప్పవు

మా పరిధిలో అనుమతి లేని నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చిన తక్షణమే చర్యలు తీసుకుంటున్నాం. రానున్న రోజుల్లో కూడా ప్లాన్ లేని భవనాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం. అలాంటి నిర్మాణాలపై మా సిబ్బందిని అప్రమత్తం చేస్తాం. అన్నిరకాల అనుమతులు తీసుకున్న తరువాతే నిర్మాణాలు చేపట్టాలని బిల్డర్లకు, వ్యక్తిగత గృహ నిర్మాణదారులకు సూచిస్తున్నాం. ఎవరి మాటలో.. నమ్మి ముందుకెళ్తే తీవ్రంగా నష్టపోతారు.

– రామలింగారెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్, జోన్–8

రౌడీ షీటర్లపై నిరంతర నిఘా



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ స్వామినాయుడు

పెందుర్తి: సర్కిల్ పరిధిలోని రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచుతున్నామని సబ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ స్వామినాయుడు అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే జైలుపాలు కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ చెడు ప్రవర్తన వలన వారి కుటుంబాలు సమాజంలో ఎంతటి నిర్లక్ష్యానికి గురవుతుందో వివరించారు. పిల్లలు స్కూళ్లు, ఇతర విధులకు వెళ్లినప్పుడు వారు ఎంత మానసిక వేదనకు గురవుతారో సోదాహరణంగా తెలిపారు. మరోసారి పాత ప్రవర్తనతో కుటుంబాలను సమాజంలో అవహేళనకు గురయ్యే పరిస్థితుల్ని తీసుకు రావద్దని హితవు పలికారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు తమ దృష్టికి వస్తే పీడీ యాక్ట్ ప్రయోగించడానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. మంచి నడవడికతో ఉండే వారిని నిరంతరం గమనించి, వారిపై ఉన్న రౌడీషీట్‌లు ఎత్తివేయడానికి ఉన్నతాధికారులు ఆలోచన చేస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. ఏఎస్‌ఐ కాశీప్రసాద్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్యునికి అభిషేకాలు



పూజలందుకున్న సూర్యనారాయణస్వామి

పెందుర్తి: సుజాతనగర్లోని సూర్యనారాయణస్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున స్వామివారికి పంచ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. అలంకరణ అనంతరం, ప్రత్యేక పూజలు జరిపారు. ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

డ్రైనేజీ అభివృద్ధికి నోచుకోక ఇబ్బందులు



దేశపాత్రునిపాలెం ఎస్సీ కాలనీ రోడ్డులో అభివృద్ధికి నోచుకోని మురుగు కాలువ

పరవాడ: మండలంలోని దేశపాత్రునిపాలెం ఎస్సీ కాలనీ రహదారిలో మురుగు కాలువ అభివృద్ధికి నోచుకోలేదు. ఏళ్ల తరబడి ఇక్కడి మురుగు కాలువను సీసీ కాలువగా తీర్చిదిద్దాలని అధికారులకు మొరపెట్టుకున్నా కనీస చర్యలు తీసుకున్న పాపాన పోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువను అభివృద్ధి చేయకపోవడంతో ఎక్కడికక్కడ మురుగు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు పెరిగిపోయి చీకటి పడితే ఇళ్లల్లో దోమల మందు, మస్కిటో బ్యాట్లతో యుద్ధం చేయాల్సి వస్తోందని, తరచూ రోగాల బారిన పడుతున్నట్లు వాపోతున్నారు. రోడ్డును ఆనుకుని ఉన్న మురుగు కాలువతో రహదారిలో రాకపోకలు సాగించే క్రమంలో వాహనచోదకులు అదుపుతప్పి కాలువలో పడిపోతున్న సంఘటనలు గతంలో జరిగాయంటున్నారు. తమ ఇబ్బందుల్ని దృష్టిలో ఉంచుకొని ఎస్సీ కాలనీ మురుగు కాలువను అభివృద్ధి చేసేందుకు జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గురుపౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణుడు



పైడివాడ అగ్రహారంలో ఇంటింట ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధకులు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం, పైడివాడ అగ్రహారం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వచ్చే నెల 10న జరగబోయే గురుపౌర్ణమిని పురస్కరించుకుని త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ఆదివారం ప్రచారం చేశారు. ఆచార్య ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక విశాఖ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ ప్రచారం జరిగింది. శ్రీకృష్ణుడిని మాత్రమే ఎందుకు జగద్గురువుగా పూజించాలో, ఆయన గొప్పతనం ఏమిటో వివరించారు. గురువు గుణాతీతుడు, గుణముల మలినం లేనివాడని కొనియాడారు. పూర్వము గురువు గుండ్రాయి లాంటి వాడు అనే నానుడి ఉండేదన్నారు. గుండ్రాయికి ఆది, అంతము ఉండవు కాబట్టే అలా పోల్చారని పేర్కొన్నారు. దేవుడే మనిషిగా జన్మిస్తే ఆయనను మాత్రమే గురువు అనాలని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక విశాఖ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు దేవి, లక్ష్మి, నాగమణి, పద్మ, మహాలక్ష్మి, మంగ, అప్పారావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తీర ప్రాంతాల్లో సండే సందడి



ముత్యాలమ్మపాలెం తీరంలో జలకాలాడుతున్న సందర్శకులు



తీరంలోని పచ్చిక బయళ్లలో ఆటపాటలతో సందడి చేస్తున్న యువత

పరవాడ: ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలు పర్యాటకులతో సందడిగా మారాయి. అనకాపల్లి, విశాఖ ఉమ్మడి జిల్లాల నలుమూలల నుంచి సందర్శకులు తరలివచ్చారు. తీర ప్రాంతాలకు చేరుకున్న సందర్శకులు తిక్కవానిపాలెంలో సముద్ర తీరంలో నిర్మించిన ఎన్టీపీసీ జెట్టీదిగువన విడిదిచేసి తీరంలో సహజ సిద్ధంగా వెలసిన ఇసుక దిబ్బలు, పచ్చిక బయళ్లలో ఆట పాటలతో సరదాగా గడిపారు. వెంట తెచ్చుకున్న అల్పాహారాలు, బిరియానీలతో తీరంలోని జీడి తోటలు, విడిది గొడుగుల కింద సహపంక్తి భోజనాలు చేశారు. సాయం సంధ్య వరకు సముద్ర స్నానాలు చేసి, అలలతో సయ్యాటలాడారు. చీకటి పడ్డ వేళ ఆనందంగా తిరుగుముఖంపట్టారు.

డీఈవోకు సత్కారం



డీఈవో ప్రేమ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఆరిలోవ: జిల్లా విద్యా శాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్‌ను డీఈవో కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్‌ను విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా డీఈవోను ఘనంగా సత్కరించారు. ఇటీవల పాఠశాలల హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీల బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ అన్ని ఉపాధ్యాయ సంఘాలు, విద్యాశాఖాధికారులు, సిబ్బంది సహకారంతో కౌన్సెలింగ్ ప్రశాంతంగా నిర్వహించగలిగామన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి డీసీఈబీ సెక్రటరీలు ఎం.వి. కృష్ణ కుమార్, సత్యనారాయణ, ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు, ఉపాధ్యక్షుడు జి.వరహాల దొర, పీడీ అసోసియేషన్ అధ్యక్షుడు లలిత్‌కుమార్, స్కూల్ గేమ్స్ సెక్రటరీ దేముడు పాల్గొన్నారు.

ఘనంగా ఉమాచంద్రమౌళీశ్వర ఆలయ వార్షికోత్సవం

వైభవంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం



వేదికపై పార్వతీపరమేశ్వరుల కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయ 11వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. పరిసర గ్రామాల ప్రజలు వేకువ జామునుంచే భారీ ఎత్తున ఆయం వద్ద బారులుతీరారు. వార్షికోత్సవం సందర్భంగా ఉదయం 7.30 నుంచి స్వామికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. గణపతి హోమం, రుద్ర హోమం జరిపారు. అనంతరం స్వామివారి కల్యాణోత్సవాన్ని ఉభయదాతల ఆధ్వర్యంలో కనులపండువగా నిర్వహించారు. కల్యాణంలో భాగంగా తొలుత శివపార్వతుల ఉత్సవమూర్తులను వేదికపై వేంజేపచేశారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవాద్యాలు, కల్యాణ వేదమంత్రాలతో ముక్కోటి దేవతలను ఆవాహన చేశారు. కల్యాణం అనంతరం అక్షింతలు, తీర్థప్రసాదాలను భక్తులకు పంచిపెట్టారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అన్నసమారాధన పెద్ద ఎత్తున నిర్వహించారు. స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొని స్వయంగా భక్తులకు వడ్డించారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో ఆది నుంచీ ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు పాల్గొని కల్యాణోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

విమాన ప్రమాద మృతులకు ఘన నివాళి



విమాన ప్రమాద మృతులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ప్రసాదరావు తదితరులు

పెందుర్తి: అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరణించిన వారికి నాయుడుతోటలోని విలో ఐ హెచ్ఆర్‌సీ ఇండో హ్యూమన్ రైట్స్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఘన నివాళులర్పించారు. చైర్మన్ రాజాన ప్రసాదరావు ఆధ్వర్యంలో కొవ్వొత్తులు ప్రదర్శించి మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ విమాన ప్రమాదంలో 480 మందికి పైగా మృతి చెందడం విషాదకరమన్నారు. ఇకపై ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఇషిత, వరలక్ష్మి, విజయ, అప్పలరాజు, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

'పంచగ్రామాల భూసమస్యకు మూల కారణం చంద్రబాబే'

- ఏడాది దాటినా పరిష్కరించని కూటమి ప్రభుత్వం
- సమైక్య ప్రజారైతు సంక్షేమ సంఘం ఆందోళన



ధర్నాలో మాట్లాడుతున్న సమైక్య ప్రజారైతు సంక్షేమ సంఘం కార్యదర్శి కృష్ణంరాజు

సింహాచలం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా పంచగ్రామాల భూసమస్యను పరిష్కరించలేదని సమైక్య ప్రజారైతు సంక్షేమ సంఘం విమర్శించింది. పంచగ్రామాల భూసమస్య పరిష్కారం కోసం సింహాచలంలో సమైక్య ప్రజారైతు సంక్షేమ సంఘం ఆదివారం ధర్నా చేసింది. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వ ఆధీనంలోనే రెవెన్యూ, ఎండోమెంట్ శాఖలు ఉంటాయని, ఈ రెండు డిపార్ట్‌మెంట్లతో ప్రభుత్వం చర్చిస్తే సమస్య పరిష్కారమవుతుందన్నారు. సంఘం కార్యదర్శి టి.వి.కృష్ణంరాజు మాట్లాడుతూ భూసమస్య రావడానికి అసలు కారణం టీడీపీ ప్రభుత్వమే అని దుయ్యబట్టారు. 1996–97 మధ్య అప్పటి సీఎం చంద్రబాబు హయాంలోనే పెందుర్తి, చినగదిలి ఎమ్మార్వోలు సింహాచలం దేవస్థానానికి రైత్వారీ పట్టాలు ఇవ్వడంతో సమస్య ప్రారంభమైందన్నారు. అప్పటి నుంచి పంచగ్రామాల్లోని ప్రజలకు ఇబ్బందులు మొదలయ్యాయని పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే 2019లో ఇచ్చిన జీవో నెం.229ను అమలు చేస్తామని యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ మాట ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు సమస్య కోర్టులో ఉందని, కోర్టు తీర్పు రాగానే పరిష్కారం చేస్తామని మభ్యపెడుతున్నారని విమర్శించారు. సమస్య పరిష్కారం అయ్యేలోపు ఇళ్ల రిపేర్లు, నిర్మాణాలు చేసుకునేందుకు ఖచ్చితంగా అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వీబీఎస్ ప్రతాప్, రమణి, గోపాలకృష్ణ, రామారావు, సత్యనారాయణ, నాగేశ్వరరావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆరిపాక జెడ్పీ హైస్కూల్లో 2004-05 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

సబ్బవరం: వారంతా రెండు దశాబ్దాల క్రితం మండలంలోని ఆరిపాక జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి పూర్తి చేసుకున్నారు. ఈ 20 ఏళ్లలో కొందరు ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేసి ఉన్నత స్థాయిలో స్థిరపడగా, మరి కొందరు ఉన్న ఊర్లోనే జీవితాల్ని ఆనందంగా గడుపుతున్నారు. వీరంతా ఇన్నేళ్ల తర్వాత మళ్లీ కలుసుకున్నారు. ఇందుకు వారు చదువుకున్న హైస్కూలే వేదికగా మారింది. ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. పాఠశాలలో 2004–05 విద్యా సంవత్సరంలో పదోతరగతి పూర్తిచేసుకున్న పూర్వ విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ, కుటుంబ స్థితిగతులను చెప్పుకుని, ఆటపాటలతో సందడి చేశారు. ఆ నాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ముందుగా విద్యా బుద్ధులు నేర్పిన గురువులు ఎ.సూర్యనారాయణరావు, ఎం.కామేశ్వరీదేవి, టి.దీపసుందరి, నూకరత్నంలను పూర్వ విద్యార్థులంతా ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేసి, ఆనందంగా గడిపారు. కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థులు మళ్ల నాగభూషణం, సతీష్, రామకృష్ణ, త్రినాథ్, ధర్మ, దొరబాబు, లోవరాజు, శాంతి, జగదేశ్వరి, రమణమ్మ, కన్యాకుమారి, కమల, సంతోషి తదితరులు ఉన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి



వరప్రసాద్(ఫైల్)

కూర్మన్నపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ నెల 12న తుంగ్లాం రైల్వే గేటు సమీపంలో జరిగిన ప్రమాదంలో చెల్లి మృతి చెందగా అన్న గాయపడిన సంగతి తెలిసిందే. యాదవ జగ్గరాజుపేటలో నివాసం ఉంటున్న గొంప సతీష్ (అలియాస్ వరప్రసాద్), చెల్లి కీర్తన విధులకు వెళ్తుండగా కంటైనర్ ఢీకొట్టడంతో కీర్తన ఘటనా స్థలిలో అక్కడికక్కడే మృతి చెందింది. వరప్రసాద్ తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. వరప్రసాద్ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మరణించాడు. దువ్వాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కరాటే టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరణ



కరాటే టోర్నీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ సీఎం రమేష్, నియోజకవర్గ బీజేపీ నాయకులు

పెందుర్తి: సబ్బవరం మండలం గుల్లేపల్లిలో వచ్చే నెల 12, 13 తేదీల్లో నిర్వహించనున్న అంతర్ రాష్ట్ర ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోస్టర్‌ను అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనకాపల్లిలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు, నిర్వాహకుడు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.